సాక్షి పెద్దపల్లి
శుక్రవారం । 16 । జూన్ । 2023



సర్వే కట్టుదిట్టంగా నిర్వహించాలి

జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని, ఇంటింటి సర్వేలో పొరపాట్లు ఉండొద్దని కలెక్టర్ అన్నారు. 8లో▸



ఆగని ఇసుక అక్రమ రవాణా

సుల్తానాబాద్ మండలంలోని పలు గ్రామాల పరిధిలోని మానేరు వాగు నుంచి ఇసుకను రాత్రీపగలు తేడా లేకుండా అక్రమంగా తరలిస్తున్నారు. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
41.0/31.0

వాతావరణం

ఆకాశం ఉదయం నిర్మలంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయి. ఈదురుగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

నేడు బల్దియాల్లో పట్టణ ప్రగతి

పెద్దపల్లిరూరల్: రాష్ట్రావతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా శుక్రవారం పట్టణప్రగతి వేడుకలను జిల్లాలోని మూడు మున్సిపాలిటీలు, రామగుండం కార్పొరేషన్‌లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సంగీత తెలిపారు. పెద్దపల్లిలో ఉదయం ఏడు గంటలకు ప్రభుత్వ జూనియర్ కాలేజీ నుంచి నందనగార్డెన్ వరకు ర్యాలీ, అనంతరం కార్యక్రమం ఉంటుందని, సుల్తానాబాద్‌లో మెప్మా, అంగన్‌వాడీ, ఆశావర్కర్లకు రంగోలీ పోటీలు, మున్సిపల్ కార్యాలయం ఎదుట మానవహారం, పద్మనాయక కల్యాణమండపంలో సమావేశం, మంథనిలో ర్యాలీ నిర్వహించి గాంధీచౌక్ ఏరియాలో వేడుకలు ఉంటాయని, రామగుండం కార్పొరేషన్ పరిధి జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలో రంగోలీ పోటీలు, మానవహారం ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

పెద్దపల్లిరూరల్: జిల్లాలో గురువారం నిర్వహించిన ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగిందని ఇంటర్ నోడల్ అధికారి కల్పన తెలిపారు. 1772 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 69మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని, ఫస్టియర్‌లో 96.10శాతం, సెకండియర్‌లో 96.60శాతం మంది హాజరయ్యారని వివరించారు.

పార్ట్‌టైం టీచర్ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకులం విద్యాలయాల్లో పార్ట్‌టైం పద్ధతిన పనిచేసేందుకు ఇంగ్లిష్ బోధించే అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ జిల్లా గురుకుల విద్యాలయాల సమన్వయ అధికారి మంజుల తెలిపారు. మల్లాపూర్ బాలికల గురుకులంలో ఫిజిక్స్, కెమిస్ట్రీ జూనియర్ లెక్చరర్స్, పీజీటీ తెలుగు, గర్రెపల్లిలో ఎకనామిక్స్, హిస్టరీ, పీజీటీ ఇంగ్లింష్, పీజీటీ బయోసైన్స్, మంథని బాలుర విద్యాలయంలో పీజీటీ తెలుగు, టీజీటీ సోషల్, రామగుండం విద్యాలయంలో ఇంగ్లిష్, గణితం, ఫిజిక్స్, జూనియర్ లెక్చరర్స్, పీజీటీ ఇంగ్లిష్, టీజీటీ ఇంగ్లిష్, టీజీటీ సోషల్, నందిమేడారం బాలికల విద్యాలయంలో ఇంగ్లిష్, జువాలజీ, బోటనీ, కెమిస్ట్రీ, జూనియర్ లెక్చరర్స్, పీజీటీ గణితం, పెద్దపల్లి, సుల్తానాబాద్ బాలుర గురుకులంలో గణితం, పీజీటీ ఇంగ్లిష్, టీజీటీ ఫిజికల్ సైన్స్, పీఈటీ పోస్టులు ఉన్నాయని తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఈనెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలని, 27న డెమో ఇంటర్వ్యూను రామగుండం సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో నిర్వహిస్తారని పేర్కొన్నారు.

ముందుంది ముప్పు.. కావాలి కనువిప్పు..!

ఆక్రమణలతోనే రాజీవ్ రహదారిపైకి వరద



జిల్లాకేంద్రంలో రంగంపల్లి వద్ద రాజీవ్‌రహదారిపై వరద నీటి ప్రవాహం (ఫైల్)

జిల్లాలోని తుర్కలమద్దికుంట, చందపల్లి గ్రామాల కుంటలు, ఎల్లమ్మచెరువు, భోజన్న చెరువు, లింగరాయకుంద, దొబ్బరివాగు, పట్టణంలోని మురుగు వరద అంతా రంగంపల్లి ఒర్రె ద్వారా ప్రవహించి చీకురాయి చెరువు మీదుగా హుస్సేన్‌మియా వాగులో కలుస్తుంది. అయితే జిల్లాకేంద్రం కావటంతో ఆక్రమణలు చోటుచేసుకోవటంతో ఒర్రె ప్రవహించే ప్రాంతం కుచించుకుపోయి, వరద పోటెత్తి రాజీవ్‌రహదారిపైకి చేరింది. దీంతో రాకపోకలు స్తంభించిపోయాయి. తాత్కాలిక చర్యలతోనే సరిపెట్టడంతో వర్షాకాలంలో మరోసారి వరద రోడ్డెక్కెందుకు అవకాశం ఉందని పట్టణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- గతేడాది వరదనీటిలో మునిగిన గోదావరిఖని, మంథని
- ఈ వర్షాకాలంలోనూ ముంపు తప్పదంటున్న పట్టణవాసులు
- అప్రమత్తంగా లేకపోవడంతో గతేడాది జిల్లావ్యాప్తంగా భారీ నష్టం
- ప్రతిపాదనలకే పరిమితమైన గోదావరికి ఇరువైపులా కరకట్టల నిర్మాణం

సాక్షి, పెద్దపల్లి: కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ జిల్లావాసులకు.. ముఖ్యంగా గోదావరిఖని, మంథని పట్టణ వాసులకు కొత్తసమస్య తెచ్చిపెట్టింది. గతేడాది భారీగా కురిసిన వర్షాలతో వరదలు వచ్చి రామగుండం, మంథనిలో పలు కాలనీలు పూర్తిగా నీటమునిగిపోయి ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. అదే సమస్య మళ్లీ పునరావృతం అయ్యే అవకాశాలున్నాయి. ఏటా వరద ముంచెత్తుతున్నా.. పాలకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు గుణపాఠం నేర్చి.. ముంపు నుంచి రక్షించే చర్యలు చేపట్టకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ప్రవాహం తాళలేక వెనక్కి

భారీ వర్షాలతో వచ్చిన వరద బొక్కలవాగు ద్వారా గోదావరిలో చేరాల్సి ఉంది. అయితే అప్పటికే గోదావరి ప్రవాహం ఉద్ధృతంగా ఉండటంతో బొక్కలవాగు నీరు వెనక్కివెళ్లి నాలాల ద్వారా పట్టణాన్ని ముంచెత్తింది. దీంతో బొక్కలవాగు, మర్రివాడ, వాగు గడ్డ, బోయినిపేట, లైన్‌గడ్డ, దొంతులవాడ, భగత్‌నగర్, చాకలివాడ, మంగలివాడ, దుబ్బగూడెం, ఎస్సీకాలనీ, అంబేద్కర్‌నగర్ తదితర పట్టణప్రాంతాలు నీటమునిగాయి. అకస్మాత్తుగా వచ్చిన వరద వల్లే పట్టణం మునిగిందని, పటిష్టమైన రక్షణ వ్యవస్థ ఉందని, ఏటా భారీ వరదలు వచ్చే అవకాశం ఉండదని యంత్రాంగం భావిస్తోంది. కానీ.. ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కరకట్ట లేక నీటమునిగి



గతేడాది భారీగా కురిసిన వర్షాలతో గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ప్రవాహ ఉద్ధృతి పెరిగింది. దీంతో జిల్లాలోని పలు కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్టు నుంచి విడుదలైన నీటితోపాటు ఎల్లంపల్లి క్యాచ్‌మెంట్ ఏరియాలో కురిసిన భారీ వర్షాలకు ఎల్లంపల్లికి వరద రికార్డుస్థాయిలో వచ్చింది. దీంతో వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదలడంతో సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టులకు వరద పోటెత్తింది. ఆ బ్యాక్‌వాటర్‌తో గోదావరి పరీవాహక ప్రాంతంలోని గోదావరిఖని, మంథని పట్టణం పూర్తిగా నీటమునిగాయి. సుందిళ్ల బ్యారేజీ నిర్మాణంతో రామగుండం ప్రాంతానికి ముప్పు ఉందని ల్యాడర్ సర్వేలో తేలటంతో గోదావరి ఒడ్డున సుమారు 8 కిలోమీటర్ల మేర సుందిళ్ల గ్రామం వరకు కరకట్ట నిర్మించి వదిలేశారు. రామగుండం వరకు మరో 5కిలోమీటర్ల మేర కరకట్ట నిర్మించేందుకు రూ.110 కోట్లతో అంచనాలు సిద్ధం చేశారు. నిధుల మంజూరు కోసం రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ను కలిసినా అవి కార్యరూపం దాల్చలేదు. దీంతో అ వి ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. గతేడాది వరదలలో మల్కాపూర్, సప్తగిరికాలనీ, ప్రశాంత్‌నగర్, రెడ్డికాలనీ, రఘుపతిరావ్‌నగర్ ముంపునకు గురయ్యాయి. అప్పటినుంచి ఇప్పటివరకు ఎలంటి చర్యలూ తీసుకోకపోవడంతో ఈ ఏడాది కూడా భారీ వర్షాలు కురిస్తే భారీ నష్టం తప్పదని స్థానికులు అంటున్నారు.

ప్రణాళికాబద్ధంగా పల్లెల ప్రగతి



ప్రకృతివనంలో చిన్నారులు, గ్రామస్తులతో కలెక్టర్



అప్పన్నపేటలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

- ప్రతి ఊరిలో నర్సరీ, ప్రకృతివనం
- ముత్తారంలో పీపీవీ సందర్శించిన కలెక్టర్ సంగీత
- అప్పన్నపేటలో వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: పల్లెలను అభివృద్ధి చేసేందుకు పల్లె ప్రగతి కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని కలెక్టర్ సంగీత అన్నారు. పెద్దపల్లి మండలం ముత్తారంలో గురువారం పల్లెప్రగతి వేడుకల్లో పాల్గొన్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ ఎద్దు కుమారస్వామి పతాకాన్ని ఆవిష్కరించారు. కలెక్టర్ సంగీత, అధికారులు, ప్రజాప్రతినిధులు పల్లెప్రకృతివనాన్ని సందర్శించారు. గ్రామానికి చెందిన మల్లికార్జున్ తన కొడుకు తలసేమియాతో బాధపడుతున్నాడని, వైద్యసేవందించేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. ప్రజావాణిలో తనను కలవాలని సూచించారు. వైకుంఠధామానికి వెళ్లే దారి సరిగ్గాలేక ఇబ్బంది పడాల్సి వస్తోందని సర్పంచ్ సహా పలువురు గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. సంబంధిత అధికారులకు నివేదించి రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయిస్తామన్నారు. ముత్తారంలో హరితహారం, పల్లెప్రకృతివనం, నర్సరీలు బాగున్నాయని కలెక్టర్ ప్రశంసించారు. ఎంపీపీ స్రవంతి, ప్రత్యేకాధికారి మైఖేల్‌బోస్, ఎంపీడీఓ రాజు, ఎంపీఓ సుదర్శన్ తదితరులున్నారు.

తెలంగాణ పల్లెలే దేశానికి ఆదర్శం: ఎమ్మెల్యే దాసరి

పల్లెలే దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లి మండలం అప్పన్నపేటలో గురువారం సర్పంచ్ చీకటి స్వరూప, పోచాలు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు బోనాలు, డప్పుచప్పుళ్లతో స్వాగతం పలికారు. పంచాయతీ ఆఫీసువద్ద జాతీయ పతాకాన్ని ఎగురవేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్లె ప్రజలకు మెరుగైన సౌకర్యాలను కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. ఉప సర్పంచ్ శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌తోనే వారసత్వ ఉద్యోగాలు





మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్, భూమి పూజ చేస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు

- కార్మిక శక్తికి అండగా రాష్ట్ర ప్రభుత్వం
- రామగుండం ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలను పునరుద్ధరించిన ఘనత సీఎంకే దక్కుతుందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. గురువారం ఆర్జీ–2 పరిధి, వకీల్‌పల్లె బొగ్గు గనిపై దశాబ్ది ప్రగతియాత్ర చేపట్టారు. కార్మికులకు ఇచ్చిన మాట ప్రకారం కారుణ్య నియామకాల పేరుతో పునరుద్ధరించి కార్మికుల ఉనికిని రక్షించారని అన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

పేదల గుడిసెలకు పట్టాలు ఇవ్వాలి

ప్రభుత్వ స్థలాల్లో నిరుపేదలు వేసుకున్న గుడిసెలకు ఇళ్ల పట్టాలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే చందర్‌ను సీపీఎం జిల్లా కమిటీ నాయకులు కోరారు. ఆయన క్యాంపు కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి వై.యాకయ్య, కార్యదర్శివర్గ సభ్యుడు ముత్యంరావు, కుమారస్వామి కలిశారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ

సింగరేణి సంస్థ పోతనకాలనీలో రూ.2.5కోట్లతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే చందర్ భూమిపూజ చేశారు. జీఎం మనోహర్, మేయర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు. రూ.2కోట్ల సీఎం ప్లాంట్ గ్రాండ్ నిధులతో నిర్మిస్తున్న తిలక్‌నగర్‌లోని రోడ్డును పరిశీలించారు.

మారిన పల్లెల రూపురేఖలు

రామగుండం: స్వరాష్ట్రంలో పల్లెల రూపురేఖలు మారాయని, కుల వృత్తిదారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఎమ్మెల్యే చందర్ అన్నారు.అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్, ఎల్లంపల్లిలో పల్లె ప్రగతి వేడుకల్లో పాల్గొన్నారు. అర్హులైన గొల్ల, కుర్మలకు గొర్రెల మంజూరుపత్రాలు అందించారు. సర్పంచ్ స్వామి, ఎంపీపీ విజయ, వైస్ ఎంపీపీ లక్ష్మి, జెడ్పీటీసీ నారాయణ, ఎంపీడీఓ ఉన్నారు.

ప్రగతి బాటలో పల్లెలు:జెడ్పీ చైర్మన్

మంథని: పల్లెలను ప్రగతి బాటలో నడిపించే ఆలోచనతో సీఎం కేసీఆర్ ముందుకు సాగుతున్నారని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ముత్తారం మండలం హరిపురంలో మాట్లాడారు. గ్రామాల్లో సదుపాయాలు కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివన్నారు.

పట్టణాలకు దీటుగా పల్లెలు



గోపాల్‌రావుపేటలో పంచాయతీ భవనానికి భూమిపూజ చేస్తున్న మంత్రి

ధర్మారం: పల్లెలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని బొట్లవనపర్తి, గోపాల్‌రావుపేటలో నిర్వహించిన పల్లె ప్రగతి కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు. గోపాల్‌రావుపేటలో రూ.20లక్షల వ్యయంతో నిర్మించనున్న పంచాయతీ భవనానికి భూమిపూజ చేశారు. గత పాలకులు పట్టణాలకే పరిమితమై పల్లెలను పట్టించుకోలేదని, కేసీఆర్ ప్రభుత్వం మాత్రం పల్లెల అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తోందని వివరించారు. ప్రజా సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే అప్పటికప్పుడే పరిష్కరిస్తానని వెల్లడించారు. సర్పంచులు రెడపాక ప్రమీల, అంజయ్య, ఎంపీటీసీ లక్ష్మి, ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, జెడ్పీటీసీ పుస్కూరి పద్మజ, సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, రైతుబంధు సమితి జిల్లా సభ్యులు పుస్కూరి రా మారావు, ఎగ్గెల స్వామి, బీఆర్ఎస్ పార్టీ మండ ల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్, నాయకులు సందనవేని కొమురయ్య, మండల ప్రత్యేక అధికారి శ్రీధర్, ఎంపీడీవో జయశీల, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఓవైపు బూడిద.. మరోవైపు కాలుష్యం



మొగల్‌పహాడ్‌లో పర్యటిస్తున్న మక్కాన్‌సింగ్

రామగుండం: ఈదురుగాలులకు భారీగా లేస్తున్న ఎన్టీపీసీ బూడిద.. మరోవైపు ఇంధన నిల్వకేంద్రాలతో భూగర్భజలాల కలుషితం.. వీటన్నింటిని పక్కనపెట్టి పల్లె ప్రగతి వేడుకల పేరుతో స్థానిక ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. ఎన్టీపీసీ ప్రభావిత గ్రామమైన మొగల్‌పహాడ్‌లో గురువారం పర్యటించారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. కుందనపల్లి సమీపంలోని ఎన్టీపీసీ బూడిద ఈదురుగాలులకు గ్రామాలను కప్పేస్తోందన్నారు. ఇంధన నిల్వ కేంద్రంతో నీరు కలుషితమై దుర్వాసన వెదజల్లుతున్నాయని తెలిపారు. మొగల్‌పహాడ్, కుందనపల్లి, అక్బర్‌నగర్, రాజీవ్‌స్వగృహ, ఇందిరమ్మకాలనీ ప్రజలు ఇబ్బంది పడుతున్నా పట్టించుకునేవారు లేరని పేర్కొన్నారు. కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని, లేకుంటే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

అందని సాయం

- 45 రోజులు గడుస్తున్నా చేతికందని పంట పరిహారం
- రెండో దఫాలో తీవ్రంగా నష్టపోయిన అన్నదాతలు
- ఉమ్మడి జిల్లాలో 97,311 మందికి తీవ్ర నష్టం
- మొత్తం 1.45 లక్షల ఎకరాల్లో పంటలు ధ్వంసం

ఉమ్మడి జిల్లాలో పంటనష్టం.. రైతుల వివరాలు

జిల్లా	పంటనష్టం (ఎకరాల్లో)	బాధిత రైతులు
కరీంనగర్	56,066	40,417
జగిత్యాల	59,794	32,444
పెద్దపల్లి	21,948	17,560
సిరిసిల్ల	8,175	6,890
మొత్తం	1,45,983	97,311



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఈ ఏడాది యాసంగి పంట సమయంలో కురిసిన అకాల వర్షాలతో కలిగిన నష్టానికి ప్రభుత్వం ప్రకటించిన పరిహారం రైతులకు నేటికీ అందలేదు. మార్చిలో ఒకసారి, మే మొదటి వారంలో మరోసారి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వరుణుడు విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలో మొదటి విడతలో నష్టపోయిన పంటలను స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ కరీంనగర్‌లో పరిశీలించారు. రైతులను ఆదుకుంటామని, ఇందుకు ఎకరాకు రూ.10వేల చొప్పున అందిస్తామని ప్రకటించారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా రూ.154 కోట్ల మేర పరిహారాన్ని ఇటీవల విడుదల చేశారు. పరిహారం జిల్లా వ్యవసాయ అధికారుల ద్వారా ఇప్పటికే రైతుల ఖాతాల్లో పడింది. అయితే.. మొదటి విడత కన్నా రెండో విడతలోనే పంటలు అధికంగా నష్టపోయాయి. ఆ పరిహారమే రైతులకు అధికంగా రావాల్సుంది. వానాకాలం పంటలు మొదలుపెట్టాలన్న అధికారుల సూచనల మేరకు చాలామంది రైతులు ఇప్పటికే సాగు పనులు ప్రారంభించారు. మరోవైపు జరిగిన నష్టానికి పరిహారం ఇంకా అందక రైతులంతా ఎదురుచూస్తున్నారు.

వానాకాలం మొదలైనా..

ఈ ఏడాది అకాల వర్షాలతో రైతులు గతంలో ఎన్నడూ చూడని నష్టాన్ని చవిచూశారు. వరి, మామిడి, మొక్కజొన్న, పుచ్చ, ఇతర వాణిజ్య పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. వాణిజ్య, కూరగాయల రైతులు పంటను కనీసం కోసుకోలేని దుస్థితి నెలకొంది. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో వరిని విస్తారంగా పండిస్తారు. రాష్ట్రంలోనే అధిక వరి ఉత్పత్తి కేంద్రంగా పేరొందిన పాత కరీంనగర్ జిల్లాలో ఈసారి వడగండ్లు, అకాల వర్షాలకు నష్టాలు కూడా అదే స్థాయిలో కనిపించాయి. సరిగ్గా పంట కోతకు వచ్చే సమయంలో వడగండ్లు, అకాలవర్షాలు, ఈదురుగాలుల కారణంగా గొలుసు దెబ్బతింది. ఫలితంగా గతేడాది కన్నా దిగుబడి తగ్గింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల్లో పంట నష్టం, రైతుల వివరాలను సేకరించింది. సాయం అందుతుందని నెలరోజులుగా ఎదురుచూస్తున్న రైతులకు నిరాశే మిగులుతోంది. మొదటి దఫా నష్ట పరిహారం కొందరికి అందినా.. తీవ్రనష్టాన్ని మిగిల్చిన రెండో దఫా పరిహారం ఇంకా అందకపోవడం వారిని తీవ్ర వేదనకు గురిచేస్తోంది.

అధికంగా జగిత్యాలలోనే..

పాత జిల్లాలో మొత్తంగా 1,45,983 ఎకరాల విస్తీర్ణంలో వరితోపాటు పలు రకాల వాణిజ్య పంటలు, కాయగూరల పంటలకు నష్టం వాటిల్లింది. జగిత్యాలలో అత్యధికంగా 59వేల ఎకరాల్లో 32 వేలకు పైగా రైతులు నష్టపోయారు. రైతుల సంఖ్యాపరంగా చూస్తే కరీంనగర్‌లోనే అధికంగా 40వేల మందికి పైగా నష్టపోయారు. అత్యల్పంగా సిరిసిల్లలో కేవలం ఎనిమిది వేల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లింది. అయితే నెలన్నర గడుస్తున్నా నేటికీ ఖాతాల్లో డబ్బులు పడకపోవడంతో వారిలో ఆందోళన నెలకొంది.

పరిహారం రాలే..



భారీ వర్షాలు, ఈదురు గాలులకు మూడు ఎకరాల్లో మామిడి పంట దెబ్బతింది. కాయ మొత్తం నేల రాలింది. ఇప్పటివరకు రూపాయి పరిహారం రాలేదు. ఈసారి పంటకు పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేలా కనిపించడం లేదు. దిగుబడి తగ్గి చాలా ఇబ్బందులు పడుతున్నాం.
– ఎడమల మహిపాల్‌రెడ్డి, రేచపల్లి, జగిత్యాల

సాయం అందలే..



నాలుగున్నర ఎకరాల్లో వరి సాగు చేయగా..ఏప్రిల్‌లో కురిసిన అకాల వర్షానికి పంట మొత్తం ధ్వంసమైంది. మంత్రి కేటీఆర్ కూడా మా వరి పంట నష్టాన్ని స్వయంగా పరిశీలించారు. అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా కూడా కల్పించారు. కానీ ఇప్పటివరకు ఆర్థిక సాయం అందలేదు.
– గంగదారి కుమార్, వీర్నపల్లి, రాజన్నసిరిసిల్ల

చిల్లిగవ్వ ఇయ్యలే..



అకాల వర్షాలకు రెండు ఎకరాల పోలం, ఒక ఎకరం మొక్కజొన్న వర్షాలకు పూర్తిగా నేల పాలైంది. సీఎం కేసీఆర్ ఎకరానికి రూ.10 వేలు ఇస్తానని ప్రకటించినా చేతికి చిల్లిగవ్వరాలేదు. మాలాంటి చిన్నకారు రైతులకు వెంటనే పరిహారం అందజేస్తే.. కాస్త ఉపశమనంగా ఉంటుంది. – బోగి సంతోష్, నంసానిపల్లి, పెద్దపల్లి

మంత్రి చూసినా లాభం లేదు



యాసంగిలో ఆరు ఎకరాలు కౌలు, సొంతం రెండు ఎకరాల్లో వరిపంట వేశాను. రెండు రోజుల్లో కోద్దామనుకుంటే వడగళ్ల వానకు పంటంతా పోయింది. వ్యవసాయాధికారులు సర్వే చేశారు. మంత్రి గంగుల కమలాకర్ వచ్చి నష్టపరిహారం ఇప్పిస్తామని చెప్పినప్పటికీ ఇంత వరకు డబ్బులు రాలేదు. – తోట శ్రీనివాస్, కౌలు రైతు, తాహెర్‌కొండాపూర్, కరీంనగర్

క్లుప్తంగా

జనారణ్యంలోకి అడవిదున్న


కుమ్మరికుంట వద్ద డి 83 కెనాల్‌లో అడవిదున్న

జూలపల్లి: అడవిదున్న దారి తప్పి జనారణ్యంలోకి వచ్చింది. మండలంలోని కుమ్మరికుంట వద్ద డి–83లో గురువారం అడవిదున్న కనిపించడంతో రైతులు ఆసక్తిగా గమనించారు. జలవిద్యుత్ కేంద్రం నుంచి అడవిలోకి వెళ్లిపోయింది. అడవిదున్న గ్రామసమీపంలోకి రావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మనుషులు ఒంటరిగా కనిపిస్తే దాడిచేసే అవకాశం ఉంటుందని అంటున్నారు.

17న జిల్లా జూడో జట్ల ఎంపిక

సుల్తానాబాద్: జూడో సంఘం ఆధ్వర్యంలో ఈనెల 17న కరీంనగర్‌లోని సాయిమానేరు పాఠశాలలో జిల్లాస్థాయి కెడెట్ బాలబాలికల జూడోజట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాటేటి సంజీవ్ కుమార్, సిలివేరి మహేందర్ తెలిపారు. 2006, 2007, 2008లో పుట్టినవారు పోటీలకు అర్హులని, జిల్లాస్థాయి పోటీల్లో రాణించినవారిని ఈనెల 20, 21 తేదీల్లో వరంగల్ జిల్లాలో జరిగే 8వ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఆసక్తి గలవారు జూడో అకాడమీలో రిపోర్టు చేయాలని, వివరాలకు 9949830494 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

గ్రామాల్లో పల్లె ప్రగతి వేడుకలు

మంథని: డివిజన్‌లోని ఆయా గ్రామాల్లో పల్లె ప్రగతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాగారంలో నిర్వహించిన వేడుకల్లో అడిషనల్ కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలోని కమాన్ నుంచి పంచాయతీ వరకు ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ బూడిద మల్లేశ్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. దుబ్బపల్లిలో సర్పంచ్ ఎరవెల్లి నరేష్‌రావు జాతీయ జండాను ఆవిష్కరించారు. డీపీవో రాంబాబు, ఎంపీపీ కొండ శంకర్, ఎంపీడీవో రమేశ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బెల్లంకొండ ప్రకాష్‌రెడి తదితరులు పాల్గొన్నారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా

- మానేరు వాగు నుంచి నిబంధనలకు విరుద్ధంగా తరలింపు
- పట్టించుకోని అధికారులు


మానేరు వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలంలోని పలు గ్రామాల పరిధిలోని మానేరు వాగు నుంచి ఇసుకను రాత్రీపగలు తేడా లేకుండా అక్రమంగా తరలిస్తున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంతోపాటు ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చాలన్న లక్ష్యంతో తొలిసారి పెద్దపల్లి జిల్లాలో సాండ్ ట్యాక్సీ విధానాన్ని ఉన్నతాధికారులు ప్రవేశపెట్టారు.

ఇసుక రీచ్‌ల నుంచే..

వినియోగదారులు ఇసుక కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే వీలు కల్పించారు. దీంతో వారి ఇళ్ల వద్దకే సాండ్‌ట్యాక్సీ ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలించేలా చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగానే సుల్తానాబాద్ మండలంలోని నీరుకుల్ల, గట్టెపల్లి, తొగర్రాయి, కదంబాపూర్ గ్రామాల్లోని మానేరు వాగులో ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేశారు. ఫలితంగా ఇక్కడి నుంచి జిల్లా నలుమూలలకు ఇసుక రవాణా జరిగేది. కానీ సాండ్‌ట్యాక్సీ కోసం ఏర్పాటు చేసిన రీచ్‌ల నుంచే ప్రస్తుతం అక్రమంగా ఇసుక తరలిపోతుంటే మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

సాండ్‌ట్యాక్సీ నిలిపివేయడంపై అనుమానాలు

సాండ్‌ట్యాక్సీలో రిజిష్టర్ అయి ఉండి, ఆన్‌లైన్ బుకింగ్ మెస్సేజ్ వచ్చిన వాహనాలకు ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక తరలించేందుకు అనుమతి లభిస్తుంది. అక్రమంగా ఇసుక తరలిపోకుండా మైనింగ్‌శాఖ సహాయకులు(ఎస్‌ఆర్వో)ను ఏర్పాటు చేశారు. దీనివల్ల అక్రమ ఇసుక దందాకు తెరపడింది. కానీ సాండ్‌ట్యాక్సీ సేవలను దాదాపు 9 నెలల నుంచి నిలిపివేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. అక్రమార్కులు ట్రాక్టర్ల ద్వారా వాగులో నుంచి ఇసుక తరలించి, డంపులుగా పోసి, లారీల్లో ఇతర ప్రాంతలకు తరలిస్తున్నారు. వీరికి ప్రజాప్రతినిధుల అండ, అధికారులకు నెలవారీ మామూళ్ల వల్లే సాండ్ ట్యాక్సీకి తెరపడిందన్న చర్చ జరుగుతోంది.

నామమాత్రపు జరిమానాతో సరి..

గత 9 నెలల్లో 60కి పైగా ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు మైనింగ్, రెవెన్యూ, పోలీసుల లెక్కల్లో ఉన్నాయి. రెవెన్యూ అధికారులు గత ఆది, సోమవారాల్లో తనిఖీలు చేపట్టారు. మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 3 ట్రాక్టర్లను గర్రెపల్లిలో, 09 ట్రాక్టర్లను సుల్తానాబాద్ పట్టణ శివారులో పట్టుకొని, తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ప్రతీరోజు వందల ట్రాక్టర్ల ఇసుక తరలిపోతుంటే అధికారులు పట్టుకొని, నామమాత్రపు జరిమానాతో సరిపెడుతున్నారని, సాయంత్రానికల్లా వాహనాలను వదిలిపెడుతున్నారన్న విమర్శలున్నాయి. దీంతో ఆయా ట్రాక్టర్లు మళ్లీ రాత్రి వెళల్లో ఇసుక తరలిస్తున్నాయి.

> **నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు**
>
> మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. ఎవరికైనా సమాచారం ఉంటే వెంటనే ఇవ్వాలి. గిర్దావర్లు తనిఖీలు చేపట్టి, ట్రాక్టర్లను పట్టుకుంటారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటివారైనా చర్యలు తప్పవు.
>
> – యాకన్న, తహసీల్దార్, సుల్తానాబాద్

విద్యార్థికి కరాటేలో గోల్డ్ మెడల్


మెడల్‌తో మణితేజ

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పెగడపల్లికి చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి మణితేజ కుంగ్‌ఫులో గోల్డ్‌మెడల్ సాధించినట్లు సరస్వతి విద్యాలయం ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. ఈనెల 14న హన్మకొండలో జరిగిన అండర్–14 విభాగంలో మెడల్ సాధించినట్లు వివరించారు. గురువారం మణిదీప్‌ను పాఠశాలలో అభినందించారు.

30లోగా దరఖాస్తు చేసుకోవాలి

పెద్దపల్లిరూరల్: జిల్లాకు చెందిన న్యాయశాస్త్ర పట్టభద్రులు అడ్మినిస్ట్రేటివ్ ఆఫ్ జస్టిస్‌లో మూడేళ్ల శిక్షణ కోసం ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ అభివృద్ధి అధికారి నాగలైశ్వర్ తెలిపారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో శిక్షణ పొందేందుకు రెండు సీట్లకు దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 90140 69939నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

'నా భర్త ఎలా చనిపోయాడో చెప్పండి'

- న్యాయం కోసం బాధితురాలి వేడుకోలు
- భర్త స్నేహితుడి ఇంటి ఎదుట బైఠాయింపు
- ఎస్సై హామీతో వెనుదిరిగిన వైనం


బైఠాయించిన శ్రీవిద్య, మద్దతుగా తరలివచ్చిన గ్రామస్తులు

రామగుండం: అంతర్గాం మండలంలోని సోమనపల్లికి చెందిన వార్డు సభ్యురాలు, గర్భిణి ఐట్ల శ్రీవిద్య తన భర్త వేణుగోపాల్ మరణానికి కారణాలు తెలిపి, న్యాయం చేయాలంటూ గురువారం అదే గ్రామానికి చెందిన తన భర్త మిత్రుడి ఇంటి ఎదుట బైఠాయించింది. ఆమె వివరాల ప్రకారం.. వేణుగోపాల్ మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పని చేస్తూ కుటుంబంతో కలిసి, గోదావరిఖనిలో నివాసం ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో స్వగ్రామానికి చెందిన ఇద్దరు బాల్యమిత్రులు హైదరాబాద్ నుంచి వచ్చారు. వేణుగోపాల్‌తో కలిసి, గత ఏప్రిల్ 21న ఆకెనపల్లి శివారులో మందు పార్టీ చేసుకున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత వేణుగోపాల్ గోదావరిఖని వెళ్లలేక సోమనపల్లిలోని సొంతింట్లో నిద్రించేందుకు బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలో ఆ వాహనం అదుపుతప్పి, పడిపోవడంతో అతని తలకు బలమైన గాయాలయ్యాయి. తోటి మిత్రుడు, స్థానికులు గోదావరిఖనిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకెళ్లారు. మూడు రోజులు చికిత్స పొందాక బ్రెయిన్ డెడ్ అయినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. కుటుంబసభ్యులు అతన్ని ఇంటికి తీసుకువస్తున్న క్రమంలో మృతిచెందాడు. అసలు ప్రమాదం జరగడానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకొని, తమ కుటుంబానికి న్యాయం చేయాలని మృతుడి భార్య శ్రీవిద్య కోరుతోంది. మృతుడికి రెండున్నరేళ్ల బాబు ఉండగా భార్య ప్రస్తుతం తొమ్మిది నెలల గర్భిణి. ఆమె ఆందోళన చేపడుతున్న విషయం తెలుసుకున్న అంతర్గాం ఎస్సై బోగె సంతోష్‌కుమార్ సోమనపల్లికి చేరుకున్నారు. బాధితురాలితో మాట్లాడి, బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకొని, న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వెనుదిరిగింది. ఆమెకు గ్రామస్తులు మద్దతుగా నిలిచారు.

ఇంటింటి సర్వే కట్టుదిట్టంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని, ఇంటింటి సర్వేలో పొరపాట్లు ఉండొద్దని కలెక్టర్ సంగీత అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణతో కలిసి తహసీల్దార్లతో సమీక్షించారు. ఎన్నికల నిర్వహణకు ఈనెల 23న ఎన్నికల కమిషన్ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తోందని, రెండోవిడత ఓటరు నమోదుకు బూత్‌స్థాయి అధికారులు ఇంటింటి సర్వేను ఈనెల 23లోగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. సర్వే మందకొడిగా సాగడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. జాబితా నుంచి తొలగించిన పేర్లు, వారికిచ్చిన నోటీసులు తదితర వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. రామగుండంలో 10వేల ఓట్లు తొలగించామని, వాటిని మరోసారి ధ్రువీకరించుకోవాలని పేర్కొన్నారు. మంథని ఆర్డీఓ వీరబ్రహ్మచారి, ఎన్నికల డీటీ ప్రవీణ్ తదితరులున్నారు.

సింగరేణిలో కోడ్ ఆఫ్ డిసిప్లిన్ మార్చాలి


మాట్లాడుతున్న విశ్వనాథ్

గోదావరిఖని : సింగరేణి సంస్థలో ఎన్నికల వాతావరణం మొదలైందని, గెలుపు కోసం అన్ని కార్మిక సంఘాలు తహతహలాడుతున్నాయని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.విశ్వనాథ్, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. గెలిచిన సంఘాలను యాజమాన్యం కోడ్ ఆఫ్ డిసిప్లిన్ పేరుతో తన చెప్పుచేతల్లో పెట్టుకునే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. కోడ్ ఆఫ్ డిసిప్లిన్ మార్చకుండా ఎన్నికలు నిర్వహించొద్దని డిమాండ్ చేశారు. గురువారం గోదావరిఖనిలో నిర్వహించిన గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం డివిజన్ ముఖ్యుల సమావేశంలో వారు మాట్లాడారు. కోడ్ ఆఫ్ డిసిప్లిన్ మార్చకుండా నిర్వహించే ఎన్నికల వల్ల కార్మిక వర్గానికి జరిగే ప్రయోజనం ఏమీ లేదన్నారు. ఈ నెల 24న కార్మిక సంఘాలతో లేబర్ కమిషనర్ సమక్షంలో జరగనున్న సమావేశంలో అన్ని కార్మిక సంఘాలు ముక్త కంఠంతో సింగరేణిలో కోడ్ ఆఫ్ డిసిప్లిన్‌ను మార్చాలని పట్టుబట్టాలని కోరారు. అన్ని కార్మిక సంఘాలకు సభ్యత్వాలు చేసుకునే, సమస్యలపై ప్రశ్నించే, విన్నవించే హక్కు కల్పించాలన్నారు. సమావేశంలో డివిజన్ కార్యదర్శి ప్రసాద్, నాయకులు సంపత్, ముత్తయ్య, ఐలయ్య, వెంకన్న, బాణయ్య తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

- తూకంలో అనుమానం వస్తే ఫిర్యాదు చేయాలి
- తూనికలు, కొలతలశాఖ అధికారి విశ్వేశ్వర్


వ్యాపారులకు జరిమానా విధిస్తున్న అధికారి విశ్వేశ్వర్

పెద్దపల్లిరూరల్: వ్యాపారుల చేతిలో మోసపోకుండా వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానం వస్తే తమకు ఫిర్యాదు చేయాలని తూనికలు, కొలతలశాఖ అధికారి విశ్వేశ్వర్ అన్నారు. పెద్దపల్లి కూరగాయల మార్కెట్‌లో గురువారం రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వినియోగదారులకు అవగాహన కల్పించారు. తూకం వేసేటప్పుడు గమనించాల్సిన విషయాలను వివరించారు. ప్యాకెట్లలో ఉన్న సామగ్రిని కొనేటప్పుడు వాటిపై తయారీదారుడి పూర్తి చిరునామా, ధరను ముద్రించి ఉంటేనే తీసుకోవాలని చెప్పారు. అనంతరం మార్కెట్‌లోని పలు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. స్టాంపింగ్ లేని త్రాసు బాట్లను గుర్తించి, యజమానులకు జరిమానా విధించారు. మూడు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

ట్రాక్టర్ల యజమానులకు జరిమానా

పాలకుర్తి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల యజమానులకు జరిమానా విధించినట్లు తహసీల్దార్ సునీత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న గోదావరి పరివాహక ప్రాంతం నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పాలకుర్తి మండలంలోని కుక్కలగూడూర్ శివారులో గ్రామస్తులు పట్టుకొని, పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు ట్రాక్టర్ల యజమానులు యాదండ్ల రాజశేఖర్, మందల నరేష్, మగ్గిడి చంద్రయ్య(రెండు ట్రాక్టర్లు)లకు రూ.5 వేల చొప్పున రూ.20 వేల జరిమానా విధించినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

'మమ్మల్ని తొలగించే హక్కు ఎవరిచ్చారు?'

- బీజేపీ జిల్లా అధ్యక్షుడినే సస్పెండ్ చేయాలి
- విలేకరులతో పార్టీ మండలాల అధ్యక్షులు


మాట్లాడుతున్న బీజేపీ మండలాల అధ్యక్షులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి అసెంబ్లీ పరిధిలో బీజేపీ మండలాల అధ్యక్షులను ఏకపక్షంగా నియమించే అధికారం జిల్లా అధ్యక్షుడికి ఎవరిచ్చారని పెద్దపల్లి మండల అధ్యక్షుడు పర్శ సమ్మయ్య, ఓదెల అధ్యక్షుడు శనిగరపు రమేష్ ప్రశ్నించారు. జిల్లాకేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. నామినేటెడ్ పోస్టుగా జిల్లా అధ్యక్షుడినని ప్రకటించుకుని.. మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గంలో పార్టీని భ్రష్టు పట్టించేలా రాష్ట్ర కార్యవర్గంలోని ఓ నాయకుడి సూచనల మేరకు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 30 ఏళ్లుగా పార్టీకి సేవలందిస్తున్న తమను తొలగించే హక్కు ఆయనకు ఎక్కడిదని మండల అధ్యక్షులు మామిడాల రమేశ్, రాజు నిలదీశారు. జిల్లా అధ్యక్షుడినని చెప్పుకుంటున్న రాజేందర్ కార్పొరేటర్ పదవికి పోటీచేసి డిపాజిట్ దక్కించుకోలేదని, ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. కాంగ్రెస్ టికెట్‌పై ఎంపీటీసీగా ఎన్నికైన వ్యక్తికి బీజేపీలో సభ్యత్వం లేకున్నా పదవి ఎలా కట్టబెడతారని ప్రశ్నించారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న వారిని ఇబ్బంది పెడితే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. నాయకులు కర్రె సంజీవరెడ్డి, పిన్నింటి రాజు, శ్రీనివాసరావు, సదానందం, జనార్దన్‌రెడ్డి తదితరులున్నారు.

సుతిలి కొనుగోలులో అక్రమాలపై 23న విచారణ

మంథని: మంథని సింగిల్‌విండో ధాన్యం కొనుగోలు కేంద్రంతోపాటు ఇతర కేంద్రాల్లో సుతిలి కొనుగోలులో అక్రమాలపై ఈ నెల 23న విచారణకు జిల్లా సహకార అధికారి మైఖేల్ బోస్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. మూడేళ్లుగా ఆయా కేంద్రాల్లో సుతిలి కొనుగోలులో అవినీతి జరిగిందని మంథనికి చెందిన ఇనుముల సతీశ్ గత ఏప్రిల్ 17న ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ సూచన మేరకు విచారణకు హాజరు కావాలని మంథని సింగిల్‌విండో కార్యదర్శిని జిల్లా సహకార అధికారి ఆదేశించారు.

ఇరువర్గాలపై కేసు

జ్యోతినగర్: పరస్పరం దాడి చేసుకున్న ఘటనలో ఇరువర్గాలపై ఎన్టీపీసీ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. క్రషర్‌నగర్‌కు చెందిన సూరిపోగు మల్లికార్జున్, గణపతి, భాగ్య, దివ్య, అదే ప్రాంతానికి చెందిన సూరిపోగు నారాయణ, కీర్తి, కోటేశ్వరి, సాల్మన్, సూర్య, మధురవాణిలు గురువారం పరస్పరం దాడి చేసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇరువర్గాల వారిపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

22లోగా అభ్యంతరాలు తెలపాలి

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ఖాళీగా ఉన్న 11 పోస్టులకు సంబంధించి ఈనెల 16న ప్రదర్శించిన జాబితా అందుబాటులో ఉందని డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ తెలిపారు. జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 22లోగా తమ దృష్టికి తేవాలని కోరారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య


ప్రకాశ్ (ఫైల్)

పాలకుర్తి: మండలంలోని కుక్కలగూడుర్‌కు చెందిన సాంబారి ప్రకాశ్(45) గురువారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బసంత్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేటు కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న ప్రకాష్.. అనారోగ్యం కారణంగా కొద్దిరోజులుగా ఇంటివద్దనే ఉంటున్నాడు. వారం క్రితం ఆయన భార్య స్వరూప మంచిర్యాల జిల్లా దొనబండలోని తన పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన ప్రకాశ్ బుధవారం రాత్రి గదిలో ఉరేసుకున్నాడు. ఉదయమైనా బయటకు రాకపోవడంతో కుటుంబసభ్యులు నిద్ర లేపేందుకు వెళ్లగా అప్పటికే చనిపోయి కనిపించాడు. ప్రకాశ్‌కు కుమారుడు ప్రజ్ఞాన్, కుమార్తె ప్రియ ఉన్నారు. మృతుడి తండ్రి జ్ఞానయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సింగరేణి డిస్పెన్సరీ సందర్శన


ఆస్పత్రిలో మందులను పరిశీలిస్తున్న జీఎం మనోహర్

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థ పోతన కాలనీ డిస్పెన్సరీని జీఎం మనోహర్ గురువారం సందర్శించారు. రోగుల వివరాలు, మందులు, ఆస్పత్రిలోని సౌకర్యాలు తదితర వివరాలు తెలుసుకున్నారు. ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులకు వైద్యపరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) రాజేంద్రప్రసాద్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ గౌతమి, డాక్టర్ చంద్రశేఖర్, సీనియర్ పర్సనల్ అధికారి మండల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్క్రాప్ దుకాణంలో అగ్ని ప్రమాదం


మంటలు ఆర్పుతున్న స్థానికులు

జ్యోతినగర్: స్క్రాప్ దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవించి, పలు వస్తువులు దగ్ధమయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మేడిపల్లి రోడ్‌లో ఉన్న రఫీక్ స్క్రాప్ దుకాణంలో గురువారం ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. పొగ రావడంతో స్థానికులు గమనించి, వెంటనే మంటలను ఆర్పివేశారు. జనావాసాల మధ్య ఇలాంటి దుకాణాలు ఉండటం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతారని, వాటిని దూరప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు.